ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
మంగళవారం 18 జూన్ 2024



'గులాబీ' ఎమ్మెల్సీలపై.. కాంగ్రెస్ నజర్!

ఉమ్మడి వరంగల్ ఎమ్మెల్సీలే లక్ష్యంగా ఆపరేషన్ ఆకర్ష్

- శాసనమండలిలో బలం కోసం అధిష్ఠానం వ్యూహాలు
- ఓరుగల్లు నేతలతో హస్తం పార్టీ ముఖ్యనేతల మంతనాలు
- డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, సత్యవతిరాథోడ్, తక్కళ్లపల్లిలకు గాలం?
- ఇప్పటికే వరుస ఓటములతో నిస్పృహలో బీఆర్ఎస్ నాయకులు
- కాంగ్రెస్‌లో చేరికకు ఇప్పటికే కొందరి సుముఖత

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కీలకమైన బిల్లుల ఆమోదానికి శాసనమండలిలో మెజార్టీ అవసరమున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నజర్.. ఓరుగల్లు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై పడింది. ప్రస్తుతం కాంగ్రెస్‌కు ఉన్న ఎమ్మెల్సీలతో మండలిలో నెగ్గుక రావటం అసాధ్యం కావడం.. గులాబీ పార్టీకి ఉన్న బలంతో కీలకమైన బిల్లులను మండలిలో అడ్డుకునే అవకాశం ఉండటంతో మండలిలో పైచెయ్యి సాధించేందుకు కాంగ్రెస్ నెంబరు గేమ్ స్టార్ట్ చేసింది. అందులో భాగంగా తొలుత ఓరుగల్లు ఎమ్మెల్సీను హస్తం గూటికి చేర్చుకునేందుకు వ్యూహ రచన చేస్తున్నట్లుగా సమాచారం. ఇప్పటికే శాసనసభ, లోక్‌సభ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరుస ఓటమిలతో గులాబీ ఎమ్మెల్సీలు నిస్పృహలో ఉన్నట్టు గుర్తించిన కాంగ్రెస్ ఎమ్మెల్సీలను ఆకర్షించేందుకు కసరత్తు ప్రారంభించింది. కీలక నేతలను కాంగ్రెస్ రంగంలోకి దించి.. చర్చలు జరుపుతున్నట్టు జరుగుతున్న ప్రచారం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమైంది.

మండలి కోసం కాంగ్రెస్ నెంబర్ గేమ్..

శాసనసభలో కాంగ్రెస్‌కు మెజార్టీ ఉంది. ఇటీవల కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించటంతో ఆ పార్టీ బలం 65కు పెరిగింది. సీపీఐకి ఉన్న ఏకైక ఎమ్మెల్యే మద్దతు కూడా కాంగ్రెస్‌కే ఉంది. అయితే ఎటొచ్చి మండలిలోనే కాంగ్రెస్ బలహీనంగా ఉంది. మండలిలో కాంగ్రెస్‌కు కేవలం ఐదుగురే ఎమ్మెల్సీలున్నారు. దీంతో మండలిలో బలం పెంచుకునేందుకు ఆపరేషన్ ఆకర్ష్‌కు పదను పెట్టినట్టు ప్రచారం జరుగుతోంది. తొలుత ఆరుగురు ఎమ్మెల్సీలు ఉన్న ఉమ్మడి వరంగల్ నుంచి నలుగురిని హస్తం గూటికి ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. గులాబీ ఎమ్మెల్సీలతో చర్చలు జరిపే బాధ్యతను ఖమ్మం ఎంపీ రఘురామిరెడ్డి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే, మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరికి బాధ్యతలు అప్పగించినట్టు సమాచారం. దీంతో అంతర్గతంగా రంగంలోకి దిగిన ఇరువురు నేతలు ఎమ్మెల్సీలతో చర్చలు జరుపుతున్నట్లుగా తెలిసింది. ఉమ్మడి వరంగల్ నుంచి మొత్తం ఆరుగురు ఎమ్మెల్సీలు ఉండగా, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూధనాచారి, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి మినహ మిగతా నలుగురు ఎమ్మెల్సీలను పార్టీలో చేర్చుకోవాలనే లక్ష్యంగా కాంగ్రెస్ పావులు కదుపుతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది.

పాత కాంగ్రెస్ నేతలకు గాలం..

గతంలో కాంగ్రెస్‌లో కీలకంగా పని చేసిన ప్రస్తుత బీఆర్ఎస్ ఎమ్మెల్సీలను టార్గెట్‌గా వ్యూహరచన చేసినట్లుగా సమాచారం. అందులో భాగంగా గతంలో కాంగ్రెస్‌లో మంత్రిగా పని చేసిన వరంగల్‌కు చెందిన బస్వరాజు సారయ్యను కాంగ్రెస్‌లోకి తీసుకొచ్చేందుకు ఖమ్మం ఎంపీ రఘురామిరెడ్డి కుటుంబ సభ్యులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థిగా రఘురామిరెడ్డి పేరు ఖరారు కాగానే, సారయ్య ఖమ్మం వెళ్లి రామసహాయం కుటుంబాన్ని కలిసి వచ్చారు.



మర్యాదపూర్వకంగానే కలిసినట్లుగా అప్పట్లో సారయ్య వివరణ ఇచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో మారిన రాజకీయాలతో పాటు రామసహాయం కుటుంబంతో ఉన్న సత్సంబధాలతో మూలంగా సారయ్య కాంగ్రెస్‌లోకి వెళ్లే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనే చర్చ జరుగుతోంది. వరంగల్ మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి శిష్యుడిగా సారయ్య రాజకీయాల్లో రాణించారు. మళ్లీ రామసహాయం కుటుంబం కాంగ్రెస్‌లో కీలకంగా మారటంతో బస్వరాజు సారయ్య చూపు కూడా కాంగ్రెస్ వైపు మళ్లిందనే చర్చ జరుగుతోంది. 2026 నవంబరు31వ తేదీన సారయ్య ఎమ్మెల్సీ పదవికాలం పూర్తి కానుంది. అయితే మరోసారి కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తామనే హామీతో సారయ్యను పార్టీలోకి చేర్చుకునే ప్రయత్నాలు జరుగుతున్నట్టు సమాచారం. అలాగే మండలి డిప్యూటీ చైర్మన్‌గా ఉన్న బండా ప్రకాష్ చూపు సైతం కాంగ్రెస్ వైపే ఉందనే చర్చ జరుగుతోంది. సుదీర్ఘకాలం కాంగ్రెస్‌లో ఉన్న బండా ప్రకాష్ 2017లో బీఆర్ఎస్‌లో చేరారు. 2018లో బండా ప్రకాష్‌ను బీఆర్ఎస్ రాజ్యసభకు పంపించింది. ఆ తరువాత 2021లో ఈటల రాజేందర్ బీజేపీలో చేరటంతో అదే సామాజిక వర్గానికి చెందిన బండా ప్రకాష్‌ను 2021 డిసెంబరు 1న ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా శాసనమండలికి పంపించి, డిప్యూటీ చైర్మన్ చేశారు. 2027 నవంబరు 30వ తేదీ వరకు ప్రకాష్‌కు పదవికాలం ఉంది. అయితే 1980 నుంచి 2017 వరకు మూడున్నర దశాబ్దాలకు పైగా కాంగ్రెస్‌తో బండా ప్రకాష్‌కు రాజకీయ అనుబంధం ఉంది. ఈ నేపథ్యంలో ప్రకాష్‌ను తిరిగి కాంగ్రెస్‌లోకి తీసుకవచ్చేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. బండా ప్రకాష్, బస్వరాజు సారయ్య ఇద్దరు కూడా పాత కాంగ్రెస్ నేతలే కావటంతో వీరు త్వరలోనే కాంగ్రెస్‌లో చేరుతారనే చర్చ రాజకీయవర్గాల్లో జోరుగా సాగుతోంది.

గులాబీ ఎమ్మెల్సీలపై గురి...

శాసనసభ్యుల కోటాలో ఎమ్మెల్సీలుగా ఎన్నికైన మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన నేతల్లో ఒకరైనా ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావులపై కాంగ్రెస్ నేతలు గురి పెట్టినట్టు సమాచారం. మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ పదవీకాలం వచ్చే ఏడాది మార్చి 30వ తేదీతో పూర్తి కానుంది. దీంతో మళ్లీ ఎమ్మెల్సీ పదవి రెన్యువల్ హామీతో సత్యవతిరాథోడ్‌ను కాంగ్రెస్‌లోకి తీసుకొచ్చేందుకు నాయకులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారన్న చర్చ జరుగుతోంది. గతంలో టీడీపీ, బీఆర్ఎస్‌లో పని చేసిన సందర్భంలో సత్యవతిరాథోడ్‌తో స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియంకి సత్సంబధాలున్నాయి. ఈ నేపథ్యంలో సత్యవతితో చర్చలు జరిపే బాధ్యతను కడియం శ్రీహరిపై పెట్టినట్టు సమాచారం. దీంతో పాటు ఎమ్మెల్సీ రవీందర్‌రావును కూడా హస్తం గూటికి తీసుకవచ్చేందుకు చర్చలు జరుపుతున్నట్టు తెలిసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమిపై రవీందర్‌రావు సంచలన వాఖ్యాలు చేశారు.

ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్ లాంటి వారికి మంత్రి పదవులు ఇవ్వటం మూలంగానే ప్రజలు బీఆర్ఎస్‌ను ఓడించారని వాఖ్యానించడం సంచల నంగా మారింది. దీంతో రవీందర్‌రావును కాంగ్రెస్ గూటికి తీసుకవస్తే పార్టీకి మరింతా బలం పెరుగుతుందనే చర్చ ఆ పార్టీలో జరుగుతుంది. ఇప్పటికే ఒకరిద్దరు ఎమ్మెల్సీలతో అంతర్గతంగా చర్చలు పూర్తి అయినట్లుగా సమాచారం.

పార్టీలో ప్రాధాన్యత ఇవ్వటంతో పాటు భవిష్యత్తులో మంచి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇవ్వటంతో హస్తం గూటికి చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లుగా సమాచారం. మొత్తానికి కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్‌కు ఎంతమంది ఎమ్మెల్సీలు చిక్కుతారోననేదానిపై ఓరుగల్లు రాజకీయాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది.



ఎస్సీ బాలుర గురుకుల విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం అందజేస్తున్న మంత్రి సీతక్క

పేదల విద్యకు పెద్దపీట

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- మరిపెడ ఎస్సీ బాలుర గురుకులం సందర్శన

మరిపెడ, జూన్ 17 : సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల విద్యకు పెద్దపీట వేసిందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. సోమవారం మరిపెడలోని ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలను కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎంపీ బలరాంనాయక్, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్‌లతో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క విద్యార్థులతో మాట్లాడి వసతి సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ప్రిన్సిపాల్, సిబ్బందితో అకాడమిక్ విద్యా విషయాలపై సమీక్షించారు. మంత్రి సీతక్కకు అంగన్‌వాడీ టీచర్లు వారి డిమాండ్లపై వినతిపత్రం అందజేశారు. జీవో 10 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్లను, హెల్పర్లను రెగ్యులర్ చేయాలని కోరారు. అదేవిధంగా స్థానిక ఎస్టీ మినీ గురుకుల ఉపాధ్యాయులు పిల్లలకు డార్మెంటరీ గది ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎస్టీ గురుకుల స్కూల్, కళాశాలలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో తొర్రూరు ఆర్డీవో నర్సింహారావు, డీఎస్పీ సురేశ్, తహసీల్దార్ సైదులు, కాంగ్రెస్ పార్టీ నేతలు పెండ్లి రఘువీర్‌రెడ్డి, కమలాకర్, రాంరెడ్డి, అంబటి వీరభద్రం, గండి వీరభద్రం, దేవేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలిక కుటుంబాన్ని ఆదుకుంటాం : మంత్రి

మరిపెడ రూరల్ : హైదరాబాద్‌లోని మియాపూర్ శివారు ఏటిగడ్డ తండాకు వెళ్లిన గిరిజన బాలిక(12) అత్యాచారానికి గురై హత్య చేసిన హంతకులను కఠినంగా శిక్షిస్తామని మంత్రి సీతక్క అన్నారు. బాలిక స్వగ్రామమైన మరిపెడ మండలం ఎల్లంపేట శివారు లక్మాతండాలో తల్లిదండ్రులను సోమవారం పరామర్శించి మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే తరుపున రూ.50 వేలు, అంగన్‌వాడీ తరుపున రూ.25వేలతోపాటు నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బాలిక కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉపాధి కల్పిస్తామన్నారు. కుటుంబ పోషణకు ఆర్థిక సాయం అందజేస్తామన్నారు. కుమారుడికి ప్రభుత్వపరంగా ఉన్నత చదువులు చదివిస్తామని, తక్షణమే ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తామని హామీ ఇచ్చారు. అక్కడికి వచ్చిన ఎల్లంపేట బీఆర్ఎస్ నాయకులు బాలిక కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇటీవల మృతి చెందిన మాజీ ఎంపీపీ గండి బాబు కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించి ఓదార్చారు. ఎంపీ పోరిక బలరాంనాయక్, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రామచంద్రునాయక్, రాష్ట్ర నాయకుడు నూకల నరేష్‌రెడ్డి, పానుగోతు రాంలాల్, మండల పార్టీ అధ్యక్షుడు పెండ్లి రఘువీరారెడ్డి, కొండం దశరథం, గండి వీరభద్రం, మెంచు అశోక్‌కుమార్, సీడీపీవో శిరీష, నాగమణి, బానోతు వెంకన్న పాల్గొన్నారు.

బావ చేతిలో బావమరిది హతం

8లో..

మరిపెడ మండలం దంట్లకుంట తండాలో ఘటన



పాండు (ఫైల్)

ప్రజావాణికి 30 ఫిర్యాదులు

- విద్యుత్ శాఖ డీఈ విజయ్



మహబూబాబాద్ ప్రజావాణిలో వినతులను స్వీకరిస్తున్న విద్యుత్ శాఖ డీఈ విజయ్

మహబూబాబాద్ రూరల్, జూన్ 17 : జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన విద్యుత్ ప్రజావాణి కార్యక్రమానికి 30 ఫిర్యాదులు వచ్చినట్లు విద్యుత్ శాఖ డీఈ పెరుమాళ్ల పెల్లి విజయ్ తెలిపారు. తక్కువ ఓల్టేజీ వస్తుందని, లూజులైన్‌లు ఉన్నాయని, కొత్త మీటర్ల కోసం దరఖాస్తులు, కస్టూమర్ పేరు తప్పు, బిల్లింగ్ సమస్య, ట్రాన్స్‌పార్మర్ల రాగి వైరు దొంగతనం, వ్యవసాయ లైన్ పొడగింపు, ఇండ్ల పైకప్పుల నుంచి వెళ్లిన విద్యుత్ లైన్ మార్చడం, పాడైన స్టే మార్చడం, ఓవర్ లోడ్, మధ్య పోల్స్, వ్యవసాయ బావి దరఖాస్తులు, గ్రామాల్లో ఏజీ లైన్, ఇనుప స్తంభాల తొలగింపు, సబ్‌స్టేషన్ హెడ్‌క్వార్టర్-1లో 1హెచ్‌పీ డీటీఆర్‌లను 3హెచ్‌పీ డీటీఆర్‌లుగా మార్చడం సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఆయా సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి నిర్వహిస్తామని, విద్యుత్ సమస్య ఉన్న వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని డీఈ విజయ్ సూచించారు.

ఉరేసుకుని ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

- ప్రియురాలు మృతి.. ఉరిబిగుసుకోకపోవడంతో గొంతుకోసుకున్న ప్రియుడు
- విషమ పరిస్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు
- బయ్యారం మండలం కోటగడ్డలో ఘటన



ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రవీందర్



రవళి (ఫైల్)



మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో రవళి మృతదేహాన్ని పరిశీలిస్తున్న బయ్యారం ఎస్సై ఉపేందర్

బయ్యారం, జూన్ 17 : విడిపోవాల్సి వస్తుందేమోననే భయమో.. పెద్ద మనుషులు జరిమానా వేస్తారేమోననే ఆందోళనో.. లేక మరే ఇతర కారణమో తెలియదు కాని.. ఓ ప్రేమజంట ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ సంఘటన బయ్యారం మండలం కోటగడ్డలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం... కోటగడ్డ గ్రామానికి చెందిన కొటెం లక్ష్మీనారాయణ, నీలమ్మ దంపతులు కూతురు రవళికి మూడేళ్ల క్రితం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం సాయన్నపేటకు చెందిన వ్యక్తితో వివాహం జరిపించారు. కొంతకాలం కాపురం చేసిన రవళి తిరిగి తల్లిగారి ఇంటికి వచ్చేసింది. ఈ క్రమంలోనే కొటెం లక్ష్మీనారాయణ కుటుంబం జీవనోపాధి నిమిత్తం వలస వెళ్లి యాదాద్రి భువనగిరి జిల్లా రాయగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసముంటూ కోళ్లఫారంలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. అప్పుడప్పుడు స్వగ్రామమైన కోటగడ్డకు వచ్చిపోతుండేవారు. ఈ క్రమంలోనే గ్రామానికి చెందిన మెండు వీరభద్రం, సుజాత దంపతుల కుమారుడు రవీందర్, రవళి(21) నడుమ ఏర్పడిన పరిచయం ప్రేమకు దారితీసింది. సుమారు మూడు మాసాల క్రితం రాయగిరి వెళ్లిన రవీందర్ రవళిని తీసుకుపోయి ప్రేమ వివాహం చేసుకున్నట్లు సమాచారం. అనంతరం వారి ఇరువురు కుటుంబ సభ్యులు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసులు నమోదయ్యాయి. విచారణలో భాగంగా రాయగిరి పోలీసులు రవీందర్, రవళిని తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మూడు రోజుల క్రితం లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులు కోటగడ్డకు రాగా రవళి రవీందర్ ఇంట్లోనే ఉంటుంది. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి మేడపై నిద్రించిన రవీందర్, రవళి తెల్లవారుజామున కిందికి దిగి ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నారు. అప్పటికే చనిపోదామని నిర్ణయించుకున్నారో.. ఏమో తెలియదు కాని తలుపులకు గడియ బిగించిన ఇరువురు ఒకేసారి ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఉరి బిగుసుకొని రవళి అక్కడికక్కడే మృతి చెందగా.. రవీందర్ మాత్రం గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇంట్లోకి వెళ్లిన రవీందర్, రవళి ఎంతకు బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు తలుపులు పగలగొట్టి చూడగా.. రవళి మృతి చెందగా.. రవీందర్ ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. కుటుంబ సభ్యులు, ఇరుగు పొరుగు వారు వెంటనే రవీందర్‌ను జిల్లా ఆస్పత్రికి ఆపై వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ప్రస్తుతం రవీందర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనతో కోటగడ్డలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇరువురిది ఒకే గ్రామం కావటంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు స్థానికంగా పహారా ఏర్పాటు చేశారు. శవపరీక్ష అనంతరం పోలీసులు రవళి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించగా.. గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఇదిలా ఉండగా రవళి భర్త కూడా సాయన్నపేట పరిధి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

పంచాయతీ కన్నా ముందే ఉరి..

ప్రేమ వ్యవహారానికి ముందే రవళికి పెళ్లి అవ్వడం, రవళి భర్త పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయటం, రవీందర్, రవళి ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు రవీందర్, రవళి విషయం మాట్లాడేందుకు పెద్దలు సోమవారం సమావేశం కానున్నట్లు విశ్వసనీయ సమాచారం. కుల ఆచారం ప్రకారం పెద్ద మనుషుల నిర్ణయానికి కట్టుబడి ఉండాల్సి వస్తుందేమోననే భయంతో సోమవారం తెల్లవారుజామున ఇరువురు ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టారు. రవళి అక్కడికక్కడే మృతి చెందగా.. రవీందర్ ప్రాణాప్రాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. రవళి తండ్రి లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బయ్యారం ఎస్సై ఉపేందర్ పేర్కొన్నారు. కాగా, బయ్యారం సీఐ రవికుమార్ గ్రామాన్ని సందర్శించి ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు.

నేడు పీఎం కిసాన్ నిధులు విడుదల

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూన్ 17 : ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి 17వ విడత నిధులు మంగళవారం విడుదల కానున్నాయి. పీఎం కిసాన్ సమ్మాన్ నిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం సాయంత్రం 4 గంటలకు విడుదల చేయనున్నట్లు కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ నుంచి సమాచారం అందినట్లు మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ మాలతి తెలిపారు. మల్యాల కృషి విజ్ఞాన కేంద్రంలో 4 గంటలకు ఆన్‌లైన్ వెబ్ బ్రాడ్‌కాస్ట్ ద్వారా విడుదల చేస్తారని, ఈ కార్యక్రమంలో రైతులు భాగస్వాములు కావాలని కోరారు. ఒక్కొక్క రైతుకు ఏడాది రూ.6వేల చొప్పున మూడుసార్లు ఈ నిధులను విడుదల చేస్తారని చెప్పారు.

త్యాగనిరతికి ప్రతీక బక్రీద్

- జిల్లా వ్యాప్తంగా వేడుకలు
- మసీదుల్లో ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు
- పండుగ శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు







జిల్లా కేంద్రంలోని ఈద్గా మైదానంలో జరిగిన బక్రీద్ వేడుకల్లో సందేశం ఇస్తున్న ముస్లిం మతపెద్ద మౌలానా సయ్యద్ అష్మద్ రిజ్వీ ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 17 : జిల్లా వ్యాప్తంగా బక్రీద్(ఈద్-ఉల్-జుహ) వేడుకలను ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఉదయం 6.30 గంటల వరకు మహబూబాబాద్ జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాలు, గ్రామాల్లో మసీదుల వద్దకు చేరుకున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఈద్గా మైదానంలో ఉదయం 7 గంటలకు మౌలానా సయ్యద్ అహ్మద్ రిజ్వీ ముస్లింలచే ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. పట్టణలోని తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న జామియా మసీద్ మహబూబియాలో హఫీజ్ అబ్దుల్ హమీర్ సాహెబ్, కంకరబోడులోని ఈద్గా మైదానంలో ఉదయం 7.30 గంటలకు ముఫ్తి అలంగీర్ ముస్లింలచే ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. త్యాగనిరతికి ప్రతీకగా బక్రీద్ పండుగ నిలుస్తుందని ముస్లిం మతపెద్దలు తమ సందేశంలో వివరించారు. బక్రీద్ పండుగ సకల మానవ లోకానికి సౌభ్రాతృత్వాన్ని, జాతి, మత, ధనిక, పేద అనే తారతమ్యం లేకుండా వర్గబేధాలను మాని ప్రేమానురాగాలతో సంబంధాలను కలిగి ఉండాలని సూచిస్తుందన్నారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ జిల్లా కేంద్రంలో ముస్లిం మత పెద్దల ఇళ్లకు వెళ్లి ఆలింగనం చేసుకొని బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని ముస్లింలకు మాజీ ఎంపీ మాలోతు కవిత,

మిగతా 8వ పేజీలో..



హనుమకొండ రెడ్డికాలనీ మోరల్ స్కూల్ పక్కన
రోడ్డుకు అడ్డుగా వేసిన చెట్టు, రాకపోకలకు ఇబ్బంది పడుతున్న వాహనదారులు

అనుమతి లేకుండా చెట్టు నరికివేత

రోడ్డుకు అడ్డుగా వేయడంతో స్థానికుల ఆందోళన

హనుమకొండ చౌరస్తా, జూన్ 17 : పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు కార్యక్రమాలను నిర్వహిస్తూ.. మొక్కలు నాటించి వాటిని పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటుంటే.. దానికి విరుద్ధంగా హనుమకొండ 4వ డివిజన్ పరిధిలోని రెడ్డికాలనీకి చెందిన ఓ వ్యక్తి రోడ్డు పక్కన ఏపుగా పెరిగిన పచ్చని చెట్టును ఎలాంటి అనుమతులు లేకుండా నరికేశాడు. అంతటితో ఆగకుండా నరికిన ఆ చెట్టును రోడ్డుకు అడ్డంగా వేశాడు. ఈ సంఘటన తీవ్ర చర్చనీయాంశమైంది. హనుమకొండ 4వ డివిజన్ పరిధిలోని రెడ్డికాలనీ మోరల్ స్కూల్ పక్కన అదే ప్రాంతానికి చెందిన ఎ. సదానందం అనే వ్యక్తి తన ఇంటి ఎదుట, రోడ్డు పక్కన కొన్నేళ్లుగా ఏపుగా పెరిగిన చెట్టును ఆదివారం రాత్రి ఎలాంటి అనుమతులు లేకుండానే నరికి రోడ్డుకు అడ్డుగా వేశాడు. దీంతో ఆందోళనకు దిగిన స్థానికులు చెట్టును ఎందుకు నరికారంటూ నిలదీయగా తానెవరికీ చెప్పాల్సిన అవసరం లేదని, మునిసిపల్ సిబ్బంది వచ్చి తీసుకపోతారని దురుసుగా సమాధానమిచ్చాడని వాపోయారు. చెట్టును నరికిన ఆయనపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

కాజీపేట, జూన్ 17 : ఓ బాలికపై అత్యాచారం కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట మండలం భట్టుపల్లికి చెందిన రాజారపు ఉమేశ్ అనే వ్యక్తి రహ్మత్‌నగర్‌కు చెందిన ఓ బాలికను ఈ నెల 6న బైక్‌పై తీసుకెళ్లాడు. దీంతో బాలిక బంధువులు కాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నెల 15న బాలికను పట్టుకున్న పోలీసులు బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజారపు ఉమేశ్ తనను ప్రేమ పేరుతో వేధిస్తూ వెంటపడుతున్నాడని పేర్కొంది. గతేడాది తనను హైదరాబాద్‌కు తీసుకెళ్లి అత్యాచారం చేశాడని ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు సోమవారం భట్టుపల్లిలో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.



మహబూబాబాద్ జిల్లా గార్ల ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



ములుగు జిల్లా ఏటూరునాగారంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం పెద్దలు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో బక్రీద్

ఈద్గాల్లో ముస్లింల ప్రార్థనలు.. పాల్గొన్న ప్రముఖులు

మానవాళికి త్యాగ సందేశాన్ని అందించే బక్రీద్ పండుగను సోమవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ముస్లింలు ఉదయం నుంచే ఈద్గాలకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని ఖురాన్‌లోని ఈమామ్‌ను అనుసరిస్తూ కుద్బా పేరిట ప్రత్యేక నమాజ్‌లు చేశారు. హనుమకొండ, వరంగల్, కాజీపేటల్లోని ప్రముఖ ఈద్గాలతో పాటు ఉమ్మడిజిల్లాలోని ఈద్గాల్లో జరిగిన ప్రార్థనలకు పలువురు ప్రముఖులు, ప్రజాప్రతనిధులు హాజరై ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రార్థనల అనంతరం కుర్బానీ పేరిట బలిదానాలు చేసిన మేకలను సమీప బంధువులకు, నిరుపేదలకు పంచగా ముస్లింమేతరులు కూడా కుర్బానీని స్వీకరించి ఐకమత్య భావనను చాటారు.



హనుమకొండలోని పెద్దమ్మగడ్డ ఈద్గాలో నమాజ్, ప్రార్థనలు చేస్తున్న ముస్లీం మత పెద్దలు



వరంగల్‌లోని ఫోర్ట్‌రోడ్ ఈద్గాలో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



జనగామ జిల్లా నర్మెటలో ఈద్గా వద్ద ముస్లింల ప్రార్థనలు

‘ఫుడ్ ప్రాసెసింగ్’ల జాడేదీ?

నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటుకు గత సర్కారు నిర్ణయం

- మూడేళ్లుగా కాగితాలకే పరిమితమైన పార్కులు
- స్థలాల గుర్తింపుతోనే సరిపెట్టిన వైనం
- అందుబాటులోకి తెస్తే వేలాది మందికి ఉపాధి

జనగామ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటు కలగానే మిగిలిపోతోంది. 2021లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం మొదటగా జిల్లాకు ఒకటి చొప్పున ఏర్పాటు చేయాలని నిర్ణయించగా ఆ తర్వాత నియోజకవర్గానికి ఒకటి చొప్పున నెలకొల్పాలని భావించింది. వాటి ద్వారా స్థానికంగా యువతకు ఉపాధి దొరుకుతుందని, పార్కులను అభివృద్ధి చేసి స్థానికంగా ఆసక్తి ఉన్న వారికి కేటాయిస్తే ఆహార శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేయించే ఆస్కారం ఉంటుందని అప్పటి ప్రభుత్వం ఉద్దేశం. ఇందులో భాగంగా ఆయా నియోజకవర్గాల్లో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలను సైతం గుర్తించి కలెక్టర్ల ద్వారా ప్రతిపాదనలు తెప్పించుకుంది. కాని మూడేళ్ల పాటు ఈ విషయంలో ఎలాంటి ముందడుగు వేయలేదు. రాష్ట్రవ్యాప్తంగా కేవలం కొన్ని చోట్ల మాత్రమే తూతూమంత్రంగా పార్కులను నెలకొల్పగా చాలా చోట్ల పట్టించుకోలేదు.

స్థల పరిశీలనతోనే సరి

ఫుడ్ ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటు కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం స్థల పరిశీలనతోనే సరిపెట్టింది. నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేస్తామంటూ గొప్పగా చెప్పి అమలులో మాత్రం శ్రద్ధ కనబరచలేదు. రాష్ట్రవ్యాప్తంగా కొన్ని చోట్ల మాత్రమే తూతూమంత్రంగా పార్కులను అభివృద్ధి చేసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర, జనగామ జిల్లా దేవరుప్పుల మండలం మన్‌పహాడ్ గ్రామాల్లో మెగా ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లను ఏర్పాటు చేయాలని మొదటగా భావించింది. ఇందు కోసం అధికారులు వంగరలో 141 ఎకరాలు, మన్‌పహాడ్‌లో 145 ఎకరాల స్థలాన్ని గుర్తించి ప్రతిపాదనలు పంపారు. అంతేగాకుండా జనగామ జిల్లా తరిగొప్పులలో 75 ఎకరాలు, చిలుపూర్ మండలం నష్కల్‌లో 75 ఎకరాల స్థలాన్ని గుర్తించారు. అదేవిధంగా ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ పార్కుల కోసం స్థల పరిశీలన చేశారు. కాగా.. ఇందులో కేవలం వంగరలో మాత్రమే పార్కును అభివృద్ధి చేసి మిగతా చోట్ల విస్మరించారు.

కాగితాల్లోనే పార్కులు

రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటు కేవలం కాగితాలకే పరిమితమైంది. అప్పటి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా జిల్లాల్లో రెవెన్యూ అధికారులు ఆగమేఘాల మీద స్థలాలను గుర్తించి తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలు, మౌళిక వసతుల కల్పన సంస్థ(టీఎస్ఐఐసీ)కి బదలాయించారు. టీఎస్ఐఐసీ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. ఆ తర్వాత అటు టీఎస్ఐఐసీ అధికారులు గానీ, ఇటు ప్రజాప్రతినిధులు గానీ ఫుడ్ ప్రాసెసింగ్ పార్కుల అంశాన్ని పూర్తిగా విస్మరించారు. దీంతో పార్కుల ఏర్పాటు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైంది.



జనగామ జిల్లా దేవరుప్పుల మండలం మన్‌పహాడ్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ పార్కుకు కేటాయించిన స్థలం

వేలాది మందికి ఉపాధి..

ఫుడ్ ప్రాసెసింగ్ పార్కులను ఏర్పాటు చేయడం ద్వారా ఆయా జిల్లాల్లో స్థానికంగా యువతకు, కూలీలకు ఉపాధి దొరికే అవకాశాలు మెండుగా ఉన్నాయి. గుర్తించిన స్థలాల్లో టీఎస్ఐఐసీ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు అనుగుణంగా ప్లాంట్లను తయారు చేస్తుంది. వీటిని ఆసక్తి ఉన్న ఔత్సాహికులకు కేటాయిస్తుంది. దీంతో అటు యూనిట్లు నెలకొల్పిన వారితో పాటు అందులో పనిచేయడానికి అవసరమయ్యే కూలీలకు ఉపాధి దొరుకుతుంది. ఒక్కో ఫుడ్ ప్రాసెసింగ్ పార్కులో దాదాపుగా 3 వేల మందికి ఉపాధి కల్పించే అవకాశం ఉంటుందని అప్పట్లో బీఆర్ఎస్ ప్రభుత్వం పేర్కొంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వేయిస్తంభాల ఆలయానికి పోటెత్తిన భక్తులు



రుద్రేశ్వరుని దర్శనానికి బారులుదీరిన భక్తులు

హనుమకొండ కల్చరల్, జూన్ 17: నగరంలోని ప్రసిద్ధ వేయిస్తంభాల రుద్రేశ్వరాలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. శివునికి ప్రీతికరమైన రోజు కావడం, మంగళవారం నిర్జల ఏకాదశి తిథి ఉండటంతో భక్తులు ముందురోజైన సోమవారం అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని అభిషేకాలు చేశారు. సుమారు వందమంది దంపతులు సామూహిక రుద్రాభిషేకంలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ఆలయ ఈవో వెంకటయ్య పర్యవేక్షణలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శీఘ్ర దర్శనానికి ఏర్పాట్లు చేశారు. ఇటీవల కాలంలో కల్యాణ మండప పనులు పూర్తయిన నేపథ్యంలో సంపూర్ణ ఆలయాన్ని సందర్శించేందుకు భక్తుల రద్దీ ఎక్కువ కావడం గమనార్హం.

సీతక్క కాన్వాయ్‌లోకి ల్యాండ్ క్రూయిజర్

- వాహనానికి గట్టమ్మ దేవాలయం వద్ద పూజలు



వాహనానికి పూజలు చేస్తున్న మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్, జూన్ 17: మంత్రి ధనసరి సీతక్క కాన్వాయ్‌లోకి కొత్త వాహనం చేరింది. గత ప్రభుత్వ హయాంలో కొనుగోలు చేసిన ఈ బుల్లెట్ ప్రూఫ్, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన ల్యాండ్ క్రూయిజర్ వాహనాలపై వివాదం మొదలైంది. ప్రభుత్వం మారిన తర్వాత రేవంత్ రెడ్డి ప్రభుత్వం వినియోగంలోకి తెచ్చింది. ఈ క్రమంలోనే రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క కాన్వాయ్‌కి ఓ వాహనాన్ని కేటాయించారు. దీంతో సోమవారం ఆమె ములుగులోని గట్టమ్మతల్లి దేవాలయం వద్ద ఆ వాహనానికి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత కుటుంబసభ్యులతో కలిసి గట్టమ్మ తల్లిని దర్శించుకున్న సీతక్క వాహన పూజలో పాల్గొన్నారు. ఆమెవెంట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల బిక్షపతి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల భరత్, తదితరులున్నారు.

మేడిగడ్డ బ్లాక్-7లో కొనసాగుతున్న

మరమ్మతు పనులు

బ్యారేజీ ఎగువ, దిగువ ప్రాంతాల్లోని ఇసుక నిల్వల తొలగింపునకు యత్నాలు



బ్యారేజీ వద్ద పేరుకుపోయిన ఇసుక (ఫైల్)

మహదేవపూర్ రూరల్, జూన్ 17 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కుంగిన మేడిగడ్డ బ్యారేజీ బ్లాక్-7లో తాత్కాలిక మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. బ్యారేజీ గేట్లు, పిల్లర్ల కిందున్న అగాధాన్ని పూడ్చేందుకు చేపట్టిన సిమెంట్, ఇసుక గ్రౌటింగ్ ప్రక్రియతో పాటు దిగువన షీట్‌ఫైల్స్ అమరిక, సీసీ బ్లాకుల పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి. బ్లాక్-7లో మొత్తం 11 గేట్లుండగా 10గేట్లను పూర్తిస్థాయిలో ఎత్తగా ప్రభావం ఉన్న 20వ గేటు తొలగింపు పనులు కొనసాగు తున్నాయి. ఇటీవలే గేటు కటింగ్ పనులు పూర్తి చేసిన అధికారులు దాని విడిభాగాలను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

సలాం.. పోలీసన్న..

- గాయంతో ఠాణాకు వచ్చిన రైతును అక్కున చేర్చుకున్న హెడ్ పీసీ కృష్ణ
- బాధితుడికి పోలీస్‌స్టేషన్ మెడికల్ కిట్‌తో ప్రథమ చికిత్స
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం

నర్సింహులపేట, జూన్ 17 : వ్యవసాయ బావి వద్ద గెట్టు విషయంలో ఇరువురు రైతుల మధ్య జరిగిన ఘర్షణలో ఓ రైతు తీవ్రంగా గాయపడి రక్తస్రావంతో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా హెడ్ కానిస్టేబుల్ కృష్ణ అక్కున చేర్చుకొని మానవత్వం చాటుకున్నాడు. ఠాణాలో ఉన్న మెడికల్ కిట్‌తో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించిన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే... నర్సింహులపేట మండలంలోని పెద్దనాగారం వస్రాంతండాకు చెందిన జాటోతు పూల్‌సింగ్ వ్యవసాయ బావి వద్ద ఈనెల 15న అదే తండాకు చెందిన లూనావత్ సూర్యతో గెట్టు విషయంతో ఘర్షణ జరిగింది. మాటామాట పెరగడంతో సూర్య తన చేతిలో ఉన్న గడ్డపారతో దాడి చేయడంతో పూల్‌సింగ్ కాలుకు బలమైన గాయం ఏర్పడింది. తీవ్ర రక్తస్రావంతో నర్సింహులపేట పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారుడిని చూసిన విధి నిర్వహణలో ఉన్న హెడ్ కానిస్టేబుల్ బానోతు కృష్ణ చలించిపోయాడు. ఠాణాలో ఉన్న మెడికల్ కిట్‌తో ప్రథమ చికిత్స చేసి మానవత్వం చాటుకున్నాడు. కాలు గాయానికి కట్టుకట్టిన అనంతరం ఫిర్యాదు స్వీకరించి మెరుగైన వైద్యం కోసం జిల్లా ప్రధాన ఆస్పత్రికి పంపించారు. ఇది గమనించిన ఎస్సై సతీష్ కేసు నమోదు చేశారు. ఎస్సై, పోలీసు సిబ్బంది హెడ్ పీసీ కృష్ణను అభినందించడం విశేషం. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అవుతుండడంతో మండల ప్రజలు శెభాష్.. పోలీసన్న అని అభినందనలు తెలిపారు.

మా అబ్బాయి స్కూల్‌కు వెళ్లడం లేదు సార్..

సెంట్రల్ జైల్లో వేయండంటూ డయల్ 100కు ఫోన్ చేసిన తండ్రి



కృష్ణకాలనీ (భూపాలపల్లి), జూన్ 17: ‘ సార్ మా అబ్బాయి మా మాట వినడం లేదు.. స్కూల్‌కు వెళ్లమంటే వెళ్లడం లేదు.. సెంట్రల్ జైల్లో వేయండి అక్కడైనా చదువుకుంటాడు’ అంటూ ఓ తండ్రి డయల్ 100కు ఫోన్ చేసిన సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సోమవారం జరిగింది. భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలోని పుల్లూరురామయ్యపల్లికి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి సోమవారం డయల్ 100కు సోమవారం ఫోన్ చేశాడు. తన 13 ఏళ్ల కుమారుడు స్కూల్‌కు వెళ్లడం లేదని, గతేడాది కొంపెల్లి స్కూలులో వేస్తే కేవలం రెండు నెలలే పోయాడని చెప్పుకొచ్చాడు. ఏలాగైనా స్కూలుకు పంపించేలా చూడాలని కోరాడు. అయితే, ఇలా ఓ వ్యక్తి డయల్ 100కు ఫోన్ చేసి తన కుమారుడు మాట వినడం లేదని చెప్పడంతో నివ్వెరబోయిన పోలీసులు.. అత్యవసరాలకు వాడుకోవాల్సిన సర్వీసును ఇలా దుర్వినియోగం చేయడం సరికాదని శ్రీనివాస్‌ను సున్నితంగా మందలించారు. కాగా, ఎవరికి శాంతిభద్రతలు, రక్షణ సమస్య వచ్చినా బాధితులకు ముందుగా గుర్తొచ్చేది డయల్ 100 కాగా.. ఫోన్ చేసిన నిమిషాల వ్యవధిలోనే పోలీసులు వాలిపోయి సమస్యను తెలుసుకొని పరిష్కార మార్గాలు చూపుతున్నారు. అలాంటి డయల్ 100కు ఇలాంటి ఫోన్‌కాల్ రావడంతో అందరూ ఆశ్చర్యపోయారు.

అన్ని విభాగాల్లోని ఖాళీ పీహెచ్‌డీ

సీట్లను భర్తీ చేయాలి

- రిజిస్ట్రార్‌తో వాగ్వాదానికి దిగిన విద్యార్థులు



రిజిస్ట్రార్ మల్లారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న పీహెచ్‌డీ ఆశావహులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 17: కాకతీయ యూనివర్సిటీలోని అన్ని విభాగాల్లో ఖాళీగా ఉన్న పీహెచ్‌డీ సీట్లను భర్తీ చేయాలని పీహెచ్‌డీ ఆశావహ విద్యార్థులు డిమాండ్ చేశారు. పీహెచ్‌డీ కేటగిరి-2 సీట్ల భర్తీపై విద్యార్థులు సోమవారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. మల్లారెడ్డితో వాగ్వాదానికి దిగారు. కేటగిరీ-1 లో మిగిలిన సీట్లను కేటగిరి-2 కు బదలాయించి భర్తీ చేయాలన్నారు. అలాగే ప్రతీ డిపార్ట్‌మెంట్‌లో ఇప్పటి వరకు ఖాళీగా ఉన్న సీట్లను వెంటనే భర్తీ చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పీహెచ్‌డీ సీట్లను భర్తీ చేసిన మాజీ వీసీ తదితర అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం వారు రిజిస్ట్రార్‌కు ఖాళీగా ఉన్న పీహెచ్‌డీ సీట్లన్నీ భర్తీ చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎండి. పాష, ఎం. కుమార్, ఎం. భాస్కర్, ఎం. రాజు, ఎల్. రాజగోపాల్, బి. మనోహర్, ఎ. శంకర్, పి. జగదీష్, కె. తిరుపతి, బి. రాకేష్, గణేష్, శ్రీనాథ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

- కేయూ క్యాంపస్ : కేయూలో ఖాళీగా ఉన్న పీహెచ్‌డీ సీట్లన వెంటనే భర్తీ చేయాలని కేయూ స్టూడెంట్ యూనియన్ నేతలు సోమవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డిని తన చాంబర్‌లో కలిసి వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా స్టూడెంట్స్ యూనియన్ నేతలు మాట్లాడుతూ.. పీహెచ్‌డీ కేటగిరి-1,2లో మిగిలిన సీట్లే కాకుండా ఇప్పటి వరకు ఖాళీ ఉన్న అన్ని సీట్లు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కేయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరణ ఆదేశాలతో తమకున్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మట్టెడ కుమార్, మంద భాస్కర్, మోతె రాజు, రాజగోపాల్, బోట్ల మనోహర్, అంకిళ్ల శంకర్, పంజల జగదీశ్, కందికొండ తిరుపతి, బందిగా రాకేశ్, గణేశ్, శ్రీనాథ్, అజయ్ ,ఎమ్డీ పాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రజావాణికి దరఖాస్తుల వెల్లువ

- పట్టణాల్లో అత్యల్పం.. గ్రామీణ ప్రాంతాల్లో అత్యధికం
- స్వీకరణ కేంద్రాలను సందర్శించిన సీఎండీ, డైరెక్టర్, సీజీఎం

హనుమకొండ టౌన్, జూన్ 17 : విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రతీ సోమవారం ఎన్పీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ కార్యాలయాల్లో ప్రజావాణి ఏర్పాటు చేయాలన్న సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశాలతో.. అధికారులు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. తొలిరోజే ప్రజల నుంచి మంచి ఆదరణ రాగా.. పట్టణాల్లో ఉండే సర్కిల్ కార్యాలయం, డివిజన్ ఆఫీస్, సబ్‌డివిజన్ ఆఫీస్‌లో దరఖాస్తులు తక్కువగా వచ్చినా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల నుంచి ఆయా ఏఈ కార్యాలయాలకు దరఖాస్తులు అధికంగానే అందాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల నుంచి ఓవర్‌లోడ్, అదనపు ట్రాన్స్‌ఫార్మర్స్ ఏర్పాటు, లెంతీలైన్లు కాకుండా మధ్యలో పోల్స్ ఏర్పాటు చేయడం తదితర అంశాలపై ఫిర్యాదు అందాయని విద్యుత్ అధికారులు పేర్కొన్నారు. పట్టణాల్లో చెట్ల కొమ్మలు వైర్లపైకి రావడం, బిల్లింగ్ వంటి అంశాలపై ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. సర్కిల్ పరిధిలో డీఈ, ఈఆర్వో, ఏడీఈ, ఏఈ కార్యాలయాల్లో ఆయా అధికారులు సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు దరఖాస్తులు స్వీకరించగా, మధ్యాహ్నం ఎస్ఈలు తమ చాంబర్లలో స్వయంగా బాధితుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కాగా, భీమదేవరపల్లి సబ్‌డివిజన్‌లోని ఎల్కతుర్తి సెక్షన్‌తో పాటు భీమదేవరపల్లి, పరకాలలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కేంద్రాన్ని సీఎండీ కర్నాటీ వరుణ్‌రెడ్డి సందర్శించి బాధితుల నుంచి స్వయంగా దరఖాస్తులను స్వీకించారు. హనుమకొండ టౌన్ డీఈ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కౌంటర్‌ను ఆపరేషన్స్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ మోహన్‌రావు సందర్శించారు. అదే విధంగా వరంగల్ సర్కిల్ కార్యాలయంలోని కౌంటర్‌ను ఆపరేషన్స్ సీజీఎం కె.కిషన్ సందర్శించి పర్యవేక్షించారు. హనుమకొండ సర్కిల్‌లో మొత్తం 41 దరఖాస్తులు రాగా అత్యధికంగా ఎల్కతుర్తి సెక్షన్‌లో 19 దరఖాస్తులు వచ్చినట్లు హనుమకొండ ఎస్ఈ వెంకటరమణ తెలిపారు. వరంగల్ సర్కిల్‌లో మొత్తం 26 దరఖాస్తులు వచ్చినట్లు ఎస్ఈ మధుసూదన్‌రావు తెలిపారు. డీఈలు జి. సాంబరెడ్డి, ఆనందం, ఏడీఈలు మల్లికార్జున్, అశోక్, ఏఈలు టెక్నికల్ ఏఈలు పాల్గొన్నారు.



వరంగల్ సర్కిల్ ఆఫీస్‌లో దరఖాస్తు స్వీకరిస్తున్న ఎస్ఈ మధుసూదన్‌రావు



బాధితుడి నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్న హనుమకొండ డీఈ సాంబరెడ్డి, పక్కన డైరెక్టర్ మోహన్‌రావు

దేశ రక్షణలో జవాన్ల పాత్ర కీలకం

తొర్రూరు రూరల్, జూన్ 17 : దేశ రక్షణలో ఆర్మీ జవాన్ల పాత్ర ఎంతో కీలకమైందని ఎంపీటీసీ ముద్దం విక్రమ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కడెం యాకయ్య అన్నారు. తొర్రూరు మండలం అమ్మాపురం గ్రామానికి చెందిన కిన్నెర నరేందర్ ఆర్మీ ఉద్యోగానికి ఎంపికైన సందర్భంగా బీబీజే సంక్షేమ సంఘం, బీబీజే హిందూ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద దళిత కుటుంబంలో జన్మించి ఎంతో కష్టపడి దేశ సేవ చేయాలనే సంకల్పంతో ఉద్యోగం సాధించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో కుల పెద్దలు కిన్నెర యాదగిరి, శాట్ అధ్యక్షుడు తీగల కృష్ణారెడ్డి, ముద్దం వీరారెడ్డి, తులసీరామ్, వెంకన్న, కడెం వెంకటేశ్వర్లు, చార్ల శంకర్, సిరపాటి రాందాస్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మానుకోటలో అమానుషం

రైల్వేస్టేషన్ సమీపంలో పసికందు మృతదేహం లభ్యం

మహబూబాబాద్ టౌన్, జూన్ 17 : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం అమానుష ఘటన చోటు చేసుకుంది. స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో అప్పుడే పుట్టిన మగ పసికందు మృతదేహం లభ్యమైంది. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచారు. డోర్నకల్ జీఆర్పీ ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం... మహబూబాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్వేట్రాక్ కంకర రాళ్లపై అప్పుడే పుట్టిన మగశిశువును గుర్తు తెలియని వ్యక్తులు వదిలివెళ్లారు. స్థానికులు ఈ విషయాన్ని రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన రైల్వే పోలీసులు అక్కడికి చేరుకోగా అప్పటికే పసికందు మృతి చెంది ఉన్నాడు. వెంటనే పసికందు మృతదేహాన్ని మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచారు. ఈ విషయాన్ని స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులకు సమాచారం అం దించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని, ఎవరు అక్కడ వదిలివెళ్లారో గుర్తించే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని డోర్నకల్ జీఆర్పీ ఎస్సై సురేష్ తెలిపారు.

దివ్యాంగుడికి వీల్‌చైర్ అందజేత

డోర్నకల్, జూన్ 17 : డోర్నకల్ మునిసిపల్ కేంద్రానికి కొత్త ప్రకాష్ అనే దివ్యాంగుడికి హోప్‌స్టెప్ సహకారంతో సీఐ ఉపేందర్‌రావు సోమవారం వీల్‌చైర్ బహూకరించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ సమాజంలో ఇబ్బందులు పడుతున్న దివ్యాంగులను గుర్తించి హోప్‌స్టెప్ ఫౌండేషన్ ద్వారా అవసరమైన పరికాలు అందించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ తమకు తోచినంత ఇతరులకు సాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు నాగవెల్లి శ్రీనివాస్, ఏఎస్సై కోటేశ్వర్‌రావు, సభ్యులు దాసరి రాజేష్, ఎల్లావుల భువనేష్, బడెటి విష్ణు పాల్గొన్నారు.

రూ.6వేల పింఛన్ హామీ అమలు చేయాలి

కేసముద్రం, జూన్ 17 : దివ్యాంగులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.6వేల పింఛన్ అమలు చేయాలని వీహెచ్‌పీఎస్ జాతీయ కోర్ కమిటీ కోచైర్మన్ అందె రాంబాబు డిమాండ్ చేశారు. కేసముద్రం ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆసరా పింఛన్ రూ.4వేలకు, దివ్యాంగులకు రూ.6వేలకు పెంచుతామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఈ మేరకు వెంటనే పింఛన్ పెంచడమే కాకుండా అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆసరా బకాయిలను కలిపి చెల్లించాలని కోరారు. రాజీవ్ గాంధీ ఫెలోషిప్ పీహెచ్‌డీ, నెట్‌లలో దివ్యాంగులకు వయస్సు మినహాయింపు ఇవ్వాలని కోరారు. కాళ్ల జంగయ్య, పొలెపాక శంకర్, చిట్టిరాజు, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

భూదాన్ భూములను దళితులకు అప్పగించాలి

మహబూబాబాద్ రూరల్, జూన్ 17 : మహబూబాబాద్ మండలం దామ్యతండా శివారులో ఉన్న భూదాన్ భూములను దళితులకు అప్పగించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు గుగ్గిళ్ల పీరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు దామ్యతండా శివారులోని భూదాన్ భూములను సోమవారం పరిశీలించి మాట్లాడారు.

త్యాగనిరతికి ప్రతీక బక్రీద్

(5వ పేజీ తరువాయి)

మాజీ ఎమ్మెల్యే శ్రీరాం భద్రయ్యలు ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు.

వివిధ మండలాల్లో..

కొత్తగూడ గాంధీనగర్ ఈద్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎస్సై దిలీప్ పాల్గొని ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షుడు అజ్మీర్, యాకూబ్‌పాషా, అక్రమ్, బాషా, గౌస్, ఖాజా, దస్తగిరి, రజాబ్, సద్దామ్, ఇమ్రాన్, అన్వర్, మహబూబ్ అలీ పాల్గొన్నారు.

- మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం మతపెద్ద బది ఉజ్జామ మౌలానా ప్రసంగించారు. కార్యక్రమంలో యాకూబ్‌పాషా, రంజాన్, అఫ్జల్, సత్తార్, అక్తర్, రియాజ్, షానవాజ్‌ఖాన్, ఖైబెల్లి పాల్గొన్నారు.
- తొర్రూరు మునిసిపల్ కేంద్రంలోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జామా మసీద్ సభ్యులు ఎండి.జలీల్, యాకూబ్‌పాషా, మహ్మద్ అమీర్, రషీద్, గౌస్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.
- గార్ల మండల కేంద్రంలోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో అబ్దుల్లా, షేక్ బుడన్, రహీమొద్దీన్, ఖైమియా, జాని, యాకూబ్‌పాషా పాల్గొన్నారు.
- డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని పాతడోర్నకల్ ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మసీద్ ఉస్మానియా పెషిమామ్ సుల్తాన్ బక్రీద్ పండుగ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఇబ్రహీం, ఖాదర్, పాషా, ఇమామ్, గౌస్, నవాబ్ పాల్గొన్నారు.
- నెల్లికుదురు మండల కేంద్రంతో పాటు మునిగలవీడు, రాజులకొత్తపల్లి, బ్రాహ్మణకొత్తపల్లి ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో రెహమాన్, అక్బర్, జవహర్‌పాషా, బాబా, యాకూబ్‌అలీ, పకీర్ తదితరులు పాల్గొన్నారు.
- గూడూరు ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సలీం, ఖాసీం, యాకూబ్‌పాషా, ఖదీర్ పాల్గొన్నారు.
- బయ్యారంలోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.


మహబూబాబాద్ కొత్తబజారు కంకరబోడు ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


ముస్లిం మతపెద్దను ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్


మహబూబాబాద్ ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


పాత డోర్నకల్ ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


గూడూరు ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

గూడూరు, జూన్ 17 : గూడూరు మండల కేంద్రంలో ఈనెల 15న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గన్‌మెన్ ధనసరి పాపారావు, సీఆర్టీ ఉపాధ్యాయుడు చుంచా దేవేందర్ కుటుంబాలను ఆదుకుంటామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. గూడూరు మండలం మట్టేవాడ శివారు కొంగరిగిద్దలో గన్‌మెన్ ధనసరి పాపారావు కుటుంబసభ్యులను సోమవారం పరామర్శించారు. పాపారావు భార్య చైతన్య ఉద్యోగానికి సహకరిస్తానన్నారు. అనంతరం వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. పాపారావు తల్లిదండ్రులు వీరస్వామి-సుగుణలు తమ కుటుంబాన్ని ఆదుకోవాలని మంత్రికి విజ్ఞప్తి చేయగా భరోసా కల్పించారు. ఆపై గూడూరు మండలం పాత మచ్చర్లకు చేరుకుని సీఆర్టీ ఉపాధ్యాయుడు చుంచా దేవేందర్ కుటుంబాన్ని పరామర్శించారు. దేవేందర్ భార్య భారతికి ఉద్యోగం కల్పించేందుకు సహకరిస్తానన్నారు. అనంతరం వారికి ఆర్థిక సాయం అందించారు. మంత్రి వెంట మహబూబాబాద్ ఆర్డీవో ఆలివేలు, డీఎస్పీ తిరుపతిరావు, తహసీల్దార్ శ్వేత, సీఐ బాబురావు, ఎంపీడీవో వీరస్వామి, ఎస్సై నరేష్, ట్రాన్స్‌కో ఏఈ ప్రణయ్, పలు శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు. కాగా, కొంగరిగిద్ద, పాత మచ్చర్ల గ్రామాలకు తాగునీటి సమస్య ఉందని పలువురు గ్రామస్తులు మంత్రి సీతక్కకు వేర్వేరుగా వినతిపత్రాలు అందించారు.


కొంగరిగిద్దలో పాపారావు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న సీతక్క

విద్యార్థులే దేశ మానవ వనరులు : మంత్రి

కురవి : విద్యార్థులే భారతదేశ మానవ వనరులని, దేశాభివృద్ధిలో విద్యార్థులు కీలకమని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. కురవిలోని ఏకలవ్య గురుకులాన్ని సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్కకు విద్యార్థినులు ఘన స్వాగతం పలికారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ... ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల చదువుల కోసం ఎన్నో వసతులు కల్పిస్తుందని, వాటిని వినియోగించుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఈ సందర్భంగా జేఈఈ మెయిన్స్‌లో సీటు సంపాదించిన భూక్య మహేశ్వరి అనే విద్యార్థినిని సన్మానించారు. కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, జడ్పీ సీఈవో నర్మద, ఆర్డీవో ఆలివేలు, కురవి జడ్పీటీసీ బండి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీ పార్టీ నుంచి గోపన్న బహిష్కరణ

మహబూబాబాద్, జూన్17 (ఆంధ్రజ్యోతి): సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు ధనసరి సమ్మయ్య అలియాస్ వేణు అలియాస్ గోపన్నను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అశోక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబాబాద్ జిల్లా 'ఆంధ్రజ్యోతి' కార్యాలయానికి పంపిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఎన్డీ పార్టీకి సంబంధించిన విషయాలు, రహస్యాలను మా పార్టీ శత్రువులకు గోపన్న అందజేస్తున్నట్లు చెప్పారు. ఎన్డీ పార్టీని విచ్ఛిన్నం చేయడానికి ఆయన ప్రయత్నిస్తున్నాడని పేర్కొన్నారు. అతన్ని రాష్ట్ర కమిటీ నుంచి తొలగించడంతో పాటు పార్టీ ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేసి బహిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. ఈ రోజు నుంచి ఎన్డీ పార్టీకి ధనసరి సమ్మయ్య అలియాస్ గోపన్నకు ఎలాంటిసంబంధం లేదని ఆయన పేర్కొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కేసముద్రం, జూన్ 17 : కేసముద్రం మండలం పెనుగొండ శివారులో గూడూరుకువెళ్లే మార్గంలో వట్టివాగు వంతెన సమీపంలో సుమారు 40ఏళ్ల వ్యక్తి మృతదేహం గుర్తించినట్లు ఎస్‌ఐ వంశీధర్ సోమవారం తెలిపారు. ఆదివారం రాత్రి ఈ విషయం తెలియగా మృతదేహాన్ని పోస్టుమార్టంకు మహబూబాబాద్‌కు తరలించినట్లు చెప్పారు. మృతుడు మతిస్థిమితం లేనివాడిగా ఇదే ప్రాంతంలో రెండు, మూడు రోజులుగా కనిపించినట్లు తెలిపారు. గ్రామంలోకి రమ్మని అడిగినప్పటికీ రాకుండా అక్కడే ఉన్నాడని పలువురు చెప్పారు. మృతదేహాన్ని మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో భద్రపర్చామని, ఆచూకీ తెలిసిన వారు కేసముద్రం పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ సూచించారు.

శాంతి మార్గంలో పయనించాలి : ఎమ్మెల్యే

మహబూబాబాద్ టౌన్, జూన్ 17: దైవ స్వరూపి ఏసుక్రీస్తు చూపిన శాంతి మార్గంలో పయనించాలని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ పట్టణ శివారు నందినగర్‌లో ఏసుక్రీస్తు దైవ మందిరం ప్రథమ వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ దయ, కరుణ కలిగి ఉండి ఇతరులకు సాయం చేయాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మురళీనాయక్‌ను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు పోతురాజు రాజు, అరెంపుల విజయమ్మ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పెద్దవంగర, జూన్ 17 : బైక్ అదుపు తప్పడంతో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని చిట్యాల గ్రామంలో సోమవారం తెల్లవారుజమున చోటుచేసుకుంది. ఎస్సై బానోతు మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా కొడకండ్లమండలం నరసింగపురం గ్రామానికి చెందిన బొజ్జ అరుణ్‌కుమార్(20) ఐటీఐ చదువుతున్నాడు. ఆదివారం రాత్రి బైక్‌పై అరుణ్‌కుమార్ పెద్దవంగర మండలం చిట్యాల గ్రామంలోని తన మిత్రులను కలిసి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన తుమ్మ చెట్టుకు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లి బొజ్జ సరిత ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


అరుణ్‌కుమార్ (ఫైల్)

నాణ్యమైన విద్యుత్ కోసమే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

సీరోలు, జూన్ 17: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు రూ.50 లక్షల వ్యయంతో 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు మహబూబాబాద్ జిల్లా పర్యవేక్షక ఇంజనీర్ ఎస్.నరేష్ అన్నారు. సీరోలు మండలం మన్నెగూడెం విద్యుత్ ఉపకేంద్రంలో సోమవారం రూ.50 లక్షలతో ఏర్పాటు చేసిన 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించి మాట్లాడారు. మన్నెగూడెం ఉపకేంద్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, గృహజ్యోతి పథకం అమలుకు అనుగుణంగా సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి మంజూరు చేసిన 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌తో నాణ్యమైన విద్యుత్ అందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మానుకోట డివిజనల్ ఇంజనీర్ పెరుమాళ్లపెల్లి విజయ్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు రమేష్, తిరుపతి, ఏఈలు క్రాంతికుమార్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

కేసముద్రం, జూన్ 17: మండలంలోని అమీనాపురంలో గల భూనీళా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈనెల 23 నుంచి 26వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు వోలం మురళి, బచ్చు పరమేశ్వర్, కొయగూరి యాకుబ్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఆలయ సంప్రోక్షణ, మహాకుంభ ప్రతిష్ఠ, చక్రస్నానం, ద్వాదశ ఆరాధనలు ఉంటాయని చెప్పారు.

సర్వమత సమైక్యతకు సజీవ సాక్ష్యం.. ఈదులపూసపల్లి ఇమాంషావలీ దర్గా

రేపు ఒకే రోజు ఉర్సు ఉత్సవం

మహబూబాబాద్ రూరల్, జూన్ 17 : మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో వెలిసిన ఇమాంషావలీ దర్గా సర్వమత సమైక్యతకు మారుపేరుగా నిలుస్తోంది. ఏటేటా దర్గాలో నిర్వహించే ఉర్సుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతున్నారు. ప్రతి శుక్రవారం సైతం దూర ప్రాంతాల నుంచి భక్తులు ఇక్కడికి వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. సెలవు రోజుల్లో ఈ దర్గా కిటకిటలాడుతోంది. ఏటేటా ఒకే ఒక్కరోజు ఘనంగా జరిగే ఉర్సు ఉత్సవానికి అన్ని మతాల వారు వస్తున్నారు. ప్రతి సంవత్సరంలాగే ఈసారి బక్రీద్ పండుగ జరుపుకున్న రోజు నుంచి మూడవ రోజు ఈనెల 19న (బుధవారం) ఉర్సు నిర్వహణ కోసం ఈదులపూసపల్లి దర్గాలో అన్నిఏర్పాట్లు పూర్తి చేశారు. అంతకుముందు మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఈదులపూసపల్లి గ్రామం దర్గాముతవల్లి షేక్ అన్వర్‌పాషా ఇంటి నుంచి సందల్.. కందిల్ బయలుదేరి తహసీల్ ఆఫీస్‌కు చేరుకుంటుంది. అక్కడ్నుంచి రాత్రి పొద్దుపోయాక పకీర్‌ల విన్యాసాలు, బ్యాండ్‌మేళాలతో అధికారికంగా బయలుదేరనున్న సందల్, కందిల్ ప్రదర్శన బుధవారం తెల్లవారుజామున దర్గాకు చేరుకుంటుంది.




ఈదులపూసపల్లిలో విద్యుత్ దీపాల అలంకరణలో దర్గా, బక్రీద్ సందర్భంగా దర్గా నుంచి గౌసేపాక్ జెండాను ఊరేగింపుకు తీసుకువెళ్తున్న దర్గా ముతవల్లి షేక్ అన్వర్‌తాజ్ నిజామీ

దర్గా పూర్వ చరిత్ర..

ఈదులపూసపల్లిలో ఇమాంషావలి దర్గాను మహబూబాబాద్‌కు చెందిన ఓ పారిశ్రామిక వేత్త 1950లో నిర్మించినట్లు చెబుతారు. నాటి నుంచి నేటి వరకు ఇస్లాం కాలమానం ప్రకారం హిజ్రి క్యాలెండర్‌లో వచ్చే జిల్‌హజ్ మూడవ మాసంలో దేశ వ్యాప్తంగా బక్రీద్ పండుగను జరుపుకోవడం ఆనవాయితీ. బక్రీద్ పండుగ నిర్వహించుకున్న మూడవ రోజున ఇక్కడి దర్గాలో ఉర్సు నిర్వహిస్తారు. హిజ్రి క్యాలెండర్ ప్రకారం జిల్‌హజ్ మాసంలో మహబూబాబాద్ నుంచి సందల్(గంధం)ను కందిల్‌తో పాటు ఊరేగింపుగా తీసుకువెళ్లి బుధవారం ఇమాంషావలీ దర్గాలో అలంకరిస్తారు. దర్గా నిర్వాహకులైన ముతవల్లి షేక్ అన్వర్‌పాషా గంధలేపనం గావించి పలువురు ముస్లిం పెద్దల సమక్షంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. ఆపై ఉర్సును ప్రారంభించినట్లు ముతవల్లి షేక్ అన్వర్‌పాషా ప్రకటిస్తారు. అనంతరం అక్కడికి వచ్చిన భక్తులు ఫాతెహాలు ఇచ్చి తమ కోర్కెలు తీర్చే ఆపద మొక్కుల వాడిగా ఇమాంషావలీని కొలుస్తారు. ఈ ఉర్సు ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగుతుంది.

బావ చేతిలో బావమరిది హతం

మరిపెడ మండలం దంట్లకుంట తండాలో ఘటన

మరిపెడ రూరల్, జూన్ 17 : బావ చేతిలో బావమరిది హతమయ్యాడు. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని దంట్లకుంట తండాలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై సంతోష్ తెలిపిన ప్రకారం... దంట్లకుంట తండాకు చెందిన గుగులోతు మంత్రి, భార్య లక్ష్మి గొడవ పడుతుండేవారు. అయితే లక్ష్మి అన్నలైన వెంకట్యాతండా జీపీకి చెందిన మురళి, పాండులకు ఆదివారం రాత్రి సమాచారం ఇచ్చింది. దీంతో అన్నదములు మురళి, పాండు(36) దంట్లకుంట తండాకు చేరుకుని బావ మంత్రికి సర్దిచెబుతుండగా మంత్రి కర్రతో బలంగా పాండు తలపై బాదాడు. పాండు తలకు బలమైన గాయం కావడంతో ఖమ్మంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు హైదరాబాద్‌కు తీసుకువెళ్లాలని సూచించారు. పాండును హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య మంగ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

హాస్టల్ అదనపు గదులు ఎందుకు నిర్మించారు?

ఏఈపై ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ ఆగ్రహం

కురవి, జూన్ 17 : కురవిలోని గిరిజన బాలికల వసతి గృహంలో అదనపు తరగతి గదులను విద్యార్థినుల చదువులకు ఏమాత్రం ఉపయోగం లేకుండా నిర్మించారని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ సంబంధిత ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కురవిలో సోమవారం అదనపు గదుల నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. రూ.కోటి వెచ్చించి 14 అదనపు తరగతి గదులను నిర్మించారని, విద్యార్థులు ఉండేందుకు వీలుగా మరుగుదొడ్లు ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. కనీసం బ్లాక్‌బోర్డులు అమర్చలేదని, హాస్టల్ చుట్టూ అడవి లాగా పిచ్చిచెట్లు పెరిగాయని, ఈ గదుల్లో హాస్టల్ నిర్వహణ ఎలా సాధ్యమవుతుందని అధికారులను నిలదీశారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు తప్పులు దిద్దుకుని హాస్టల్ వద్ద చెట్లను తొలగించి భూమిని చదును చేయించాలని ఆదేశించారు. తాను కలెక్టర్ లేదా సంబంధిత మంత్రితో మాట్లాడి అదనపు నిధులు తీసుకువస్తానని పేర్కొన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రం, అవిరె మోహన్‌రావు, బాలగాని శ్రీను పాల్గొన్నారు.

మానుకోట రోటరీ క్లబ్‌కు మూడు అవార్డులు

మహబూబాబాద్ టౌన్, జూన్ 17 : రోటరీ క్లబ్ మానుకోట శాఖకు 2023-24 సంవత్సరానికి గాను మూడు అవార్డులు లభించాయి. 2023-24లో ప్రాథమిక విద్య- అక్షరాస్యత, పర్యావరణం, శాంతిస్థాపన-సంఘర్షణల నివారణలో మానుకోట రోటరీ క్లబ్‌కు మూడు అవార్డులు దక్కాయి. భద్రాచలం శ్రీసీతారామ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ 3150 డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ బుసిరెడ్డి శంకర్‌రెడ్డి చేతుల మీదుగా మానుకోట శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కొడారి నాగేందర్‌రావు, గూడూరు నాగేశ్వర్‌రావు అవార్డులను అందుకున్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ మానుకోట శాఖ అవార్డులు దక్కించుకోవడం పట్ల క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాలే నాగేశ్వర్ రావు, జిల్లా బాధ్యులు వద్దుల సురేందర్‌రెడ్డి, డాక్టర్ జోలి సత్యనారాయణ, బిక్కి వెంకటేశ్వర్లు, పి.సదానందం హర్షం వ్యక్తం చేశారు.

వాసవి కపుల్స్ క్లబ్ సేవలు అద్భుతం

వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ జాయింట్ సెక్రటరీ బ్రహ్మానందం

మహబూబాబాద్ టౌన్, జూన్ 17: వాసవి కపుల్స్ క్లబ్ సేవలు సమాజానికి ఎంతో మేలు చేసే విధంగా ఉన్నాయని, వారి సేవలు అద్భుతమని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ జాయింట్ సెక్రటరీ గార్లపాటి బ్రహ్మానందం అన్నారు. మహబూబాబాద్‌లోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో ఆదివారం రాత్రి వాసవి కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాన్‌టూ డెస్క్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో నిత్యం రోడ్డుపై చిరు వ్యాపారాలు చేసుకునే నిరుపేదలకు గొడుగులు అందించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి పదవ తరగతిలో 10/10 జీపీఏ మార్కులు సాధించిన విద్యార్థులను శాలువాలతో సత్కరించారు. అనంతరం నిరుపేద విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.


మహబూబాబాద్‌లో పదిలో 10/10 మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న వాసవి కపుల్స్ క్లబ్ బాధ్యులు

ఇటీవల పట్టణంలో ప్రకృతి వైపరీత్యాలకు గృహం శిథిలావస్థకు చేరుకున్న నిరుపేద మహిళ పల్లపోతుల సీతమ్మకు గృహ మరమ్మతుల కోసం రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా బ్రహ్మానందం మాట్లాడుతూ.. వాసవి కపుల్స్‌క్లబ్ సేవలను కొనసాగిస్తూ వాటిని మరింత విస్తృత పర్చాలని సూచించారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ మల్టిపుల్ వైస్ ప్రెసిడెంట్ మాలె యోగీశ్వర్‌రావు మాట్లాడుతూ... అనేక సంవత్సరాల నుంచి క్లబ్ ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలో సేవలందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ వంగవీటి భద్రయ్య, ఈగ శ్రీనివాస్, గుమ్మడవెల్లి నారాయణ, ఇమ్మడి కృష్ణమూర్తి, బొల్లం శ్రీనివాస్, వల్లాల రమేష్, జంగాల సదాశివుడు, మాలే నవీన్, శ్రవణ్, పల్లపోతుల లక్ష్మీనారాయణ, నాళ్ల వేణుగోపాల్, మాలే లక్ష్మణ్, నవీన్, మంగపతి, విజయ్ పాల్గొన్నారు.

వాసవి క్లబ్ సేవలకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు

వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ట్రెజరర్ శ్రీనివాస్

తొర్రూరు, జూన్ 17 : వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులు చేస్తున్న సేవా కార్యక్రమాలకు ప్రపంచ స్థాయి గుర్తింపు లభిస్తుందని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ మల్టిపుల్ ట్రెజరర్ ఎస్.శ్రీనివాస్ అన్నారు. తొర్రూరు డివిజన్ కేంద్రంలో క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వాసవి మాత ఆలయంలో కుర్చీల వితరణ, పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో గాంధీ విగ్రహావిష్కరణ, స్ట్రీట్ వెండర్లకు గొడుగుల పంపిణీ, 10 మంది చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు, 10 మంది వృద్ధులకు చేతికర్రల పంపిణీ, తాము మరణించిన అనంతరం ఆర్గాన్ డొనేట్ చేసే వారి నుంచి పత్రాల సేకరణ, గోశాలలో దాణా వితరణ, ప్రభుత్వ పాఠశాలలకు వాటర్ ట్యాంకుల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు చేపట్టారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవలకు ప్రజల నుంచి ఆదరణ ఉందని, ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. సేవ చేస్తే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథి వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ట్రెజరర్ గుమ్మడవెల్లి నారాయణ, రీజియన్ చైర్మన్ ప్రొద్దుటూరి గౌరీశంకర్, వాసవి క్లబ్ తొర్రూరు అధ్యక్షుడు బిజ్జాల అనిల్‌కుమార్, సెక్రెటరీ చౌడవరపు రాము, కోశాధికారి మధు, సరస్వతి క్లబ్ అధ్యక్షుడు మచ్చ సోమయ్య, సిల్వర్ స్టార్ క్లబ్ అధ్యక్షుడు మచ్చ సురేష్, వాసవి వనితా క్లబ్ అధ్యక్షురాలు దారం గాయత్రి, ఛత్రపతి శివాజీ యూత్ క్లబ్ అధ్యక్షుడు సాయితేజ, క్లబ్ సభ్యులు సామ రామ్మూర్తి, రవి, నవీన్, ఇమ్మడి రాంబాబు, బాలికల పాఠశాల హెచ్‌ఎం శారద, అఖిల్, నికిల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.